## క్లుప్తంగా

### వీర సైనికులను స్మరించుకోవాలి

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్



విశ్రాంత సైనికుడు అశోక్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓలు

శంకర్‌పల్లి: దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీడీఓలు వెంకయ్యగౌడ్, సంధ్య పేర్కొన్నారు. మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది. ఐకేపీ సిబ్బందితో కలిసి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించడం నా వంతు పాత్ర పోషిస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను అర్పించిన జవాన్‌లను మరువకూడదన్నారు. అనంతరం విశ్రాంత సైనికుడు అశోక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, ఏపీఎం భీమయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు

మొయినాబాద్‌రూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముర్తుజాగూడకు చెందిన ఆయా పార్టీల యువకులు, నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరు బీజేపీని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన కాంగ్రెస్ 50 ఏళ్ల పాలన దేశంలోనూ, రాష్ట్రంలోనూ చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీపతియాదవ్, అశోక్ యాదవ్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### రేపు చేవెళ్లకు కర్నాటక డిప్యూటీ సీఎం రాక



విలేకరులతో మాట్లాడుతున్న భీంభరత్, తదితరులు

చేవెళ్ల: ఈనెల 28న చేవెళ్లకు కాంగ్రెస్‌పార్టీ జాతీయ కార్యదర్శి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ రానున్నట్లు కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామేన భీంభరత్, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీసీసీ నాయకులు సురేందర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు ఈ నెల 18,19వ తేదీల్లో ప్రారంభించిన బస్సుయాత్ర 28వ తేదీన చేవెళ్లకు వస్తోందన్నారు. ఈ సభకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, తదితరులు హజరవుతున్నారని చెప్పారు. ఈ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, మధుసూదన్‌గుప్తా, మహేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

### రేపు పాంబండ గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల: ప్రతి పౌర్ణమికి నిర్వహించనున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీన ఉదయం 7గంటలకు నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వాహకుడు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు గిరి ప్ర దక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

### బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

జెడ్పీటీసీ ప్రమోదిని దేవి

యాలాల: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి, జెడ్పీటీసీ ప్రమోదిని దేవి జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని రాఘవాపూర్, కమాల్‌పూర్, పగిడియాల, యాలాల తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యువకులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. తాండూరు అభివృద్ధికి రోహిత్‌రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# గ్రామం ఒక్కటే.. పంచాయతీలు రెండు



ఎలుకగూడ గ్రామం

- సగం గ్రామ పంచాయతీ... మరో సగం అనుబంధ గ్రామం
- పెద్దమంగళారం నుంచి విడిపోయి పంచాయతీగా ఏర్పడిన సగం ఎలుకగూడ
- కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా మరో సగం గ్రామం

**గ్రామం ఒక్కటే.. పంచాయతీలు రెండు. సగం గ్రామం పంచాయతీగా మారితే.. మరో సగం గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది. అసలే చిన్న ఊరు.. అదీ రెండు పంచాయతీల పరిధిలో ఉండటంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.**

మొయినాబాద్: మొయినాబాద్ మండలంలోని ఎలుకగూడ గ్రామాన్ని 2018 ఆగస్టులో ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేసింది. అంతకు ముందు ఎలుకగూడ గ్రామం పెద్దమంగళారం గ్రామ పంచాయతీకి సగం, కుత్బుద్దీన్‌గూడ గ్రామ పంచాయతీకి సగం అనుబంధంగా ఉండేది. రెండు గ్రామాల రెవెన్యూ శివారుల్లో ఉన్న ఎలుకగూడ గ్రామం రెండు పంచాయతీలకు సగం సగం అనుబంధంగా కొనసాగింది. అయితే 2018 ఆగస్టులో ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే ఎలుకగూడ గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. పెద్దమంగళారానికి అనుబంధంగా ఉన్న సగం గ్రామాన్ని మాత్రమే ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉన్న మరో సగాన్ని మాత్రం అధికారులు దానికే అనుబంధంగా ఉంచారు. దీంతో ఎలుకగూడ కొత్త పంచాయతీగా ఏర్పడినా మరో సగభాగం మాత్రం అనుబంధ గ్రామంగానే కొనసాగుతుంది.

**రోడ్డే గ్రామాన్ని విడదీస్తుంది..**

ఎలుకగూడ గ్రామం అంతా ఒకే చోట ఉన్నా ప్రస్తుతం సగం గ్రామ పంచాయతీ, సగం కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉంది. ప్రత్యేక పంచాయతీగా, అనుబంధంగా ఎలుకగూడ గ్రామాన్ని రోడ్డే రెండు వైపుల విడగొడుతోంది. రోడ్డుకు ఎడమ వైపున ఎలుకగూడ గ్రామ పంచాయతీ. కుడి వైపున కుత్బుద్దీన్‌గూడ పంచాయతీకి అనుబంధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేసే సమయంలో ఎలుకగూడ మొత్తం గ్రామాన్ని కలిపి ప్రత్యేక పంచాయతీగా చేయాలని అధికారులు భావించారు. అందుకు అనుగుణంగా పెద్దమంగళారం గ్రామ పంచాయతీలో పాలకవర్గం తీర్మానం చేసింది. కానీ, కుత్బుద్దీన్‌గూడ గ్రామ పంచాయతీలో మాత్రం ఎలుకగూడను ప్రత్యేక పంచాయతీ చేయవద్దంటూ తీర్మానం చేసి గ్రామస్తులు [illegible]ంతో మొత్తం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయకుండా పెద్ద [illegible] ఉన్న భాగాన్ని [illegible] ప్రత్యేక పంచాయతీగా చేశారు.

**జనాభా వివరాలు..**

| | |
|---|---|
| ఎలుకగూడ ప్రత్యేక పంచాయతీ జనాభా | -480 |
| కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉన్న ఎలుకగూడలో జనాభా | -270 |

**ఒకే గ్రామంలో రెండు రకాల పాలన**

ఎలుకగూడ గ్రామంలో ప్రస్తుతం రెండు రకాల పాలన సాగుతోంది. సగ భాగం ప్రత్యేక పంచాయతీగా ఉండి సర్పంచ్, వార్డు సభ్యులు పాలనసాగుతుంది. సగం గ్రామం మాత్రం అనుబంధ గ్రామంగా ఉండటంతో ఏ అవసరానికైనా కుత్బుద్దీన్‌గూడకే వెళ్లాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మరో వైపు కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉన్న ఎలుకగూడలో ఆ గ్రామ సర్పంచ్ ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నికల ప్రచారం కోసం గ్రామానికి రావడంతో ఆయన ముందు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. కనీసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం తమకు సరిగ్గా అందడంలేదని.. ఏ నిధులు వచ్చినా సర్పంచ్ కుత్బుద్దీన్‌గూడలోనే పనులు చేయించుకుంటున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు తెలియజేశారు.

**నిధులు రాక ఇబ్బంది**



ఎలుకగూడ సగం గ్రామాన్నే గ్రామ పంచాయతీ చేశారు. ఇంకా సగం గ్రామం కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉంది. ఎలుకగూడ పంచాయతీ చిన్నది కావడంతో అభివృద్ధికి సరిపడా నిధులు రావడంలేదు. మొత్తం గ్రామాన్ని ఒకే పంచాయతీగా చేస్తే బాగుండేది. ఒకే పంచాయతీ చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

–కుమార్, సర్పంచ్, ఎలుకగూడ

# రాష్ట్రాన్ని ఆగం చేయాలని ప్రతిపక్షాల కుట్ర



కరపత్రం అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రాన్ని ఆగం చేయాలని కాంగ్రెస్, బీజేపీలు కుట్ర చేస్తున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని సింగప్పగూడ, న్యాలట, రామన్నగూడ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఇంటింటికి తిరిగి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపించి అభివృద్ధిని, సంక్షేమాన్ని కొనసాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాలతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నర్సింలు, సర్పంచ్‌లు రహిమాబేగం, లక్ష్మీ సత్యనారాయణ, భీమయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణచారి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తదిరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిపై తప్పడు ప్రచారం తగదు

పీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీఖాన్‌బాబర్



విలేకరులతో మాట్లాడుతున్న మహ్మద్‌అలీఖాన్ బాబర్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకనే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థిని మార్చుతారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీఖాన్‌బాబర్ మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చుతున్నారని ఓ ఫేక్ న్యూస్‌ను సోషల్ మీడియాలో అధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించమన్నారు. పార్టీ కేడర్‌ను అయోమయానికి గురి చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో వీర్లపల్లి శంకర్ పెద్ద ఎత్తున ప్రచారంలో దూసుకుపోతున్నారని తెలిపారు. గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలను మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో రఘు, కృష్ణారెడ్డి, అసద్‌ముక్తార్‌అలీ, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనునాయక్, సుదర్శన్, హుస్సేన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో కాషాయ జెండా ఎగురవేస్తాం

జిల్లా యువ మోర్చా కార్యదర్శి మహేందర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

షాబాద్: ప్రస్తుతం జరగన్ను అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ జిల్లా యువ మోర్చా కార్యదర్శి కూతురు మహేందర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాచన్‌పల్లిలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ అవినీతి, నియంత పాలన, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామన్నారు.కార్యక్రమంలో నాయకులు సాయి, శివ, నవీన్, శ్రీను, వివేక్, అరుణ్, మల్లేష్, హరికృష్ణ, యాలు, అంజి, నిఖిల్, ప్రశాంత్ తదితరులున్నారు.

### ప్రచార రథాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రచార రథాన్ని గురువారం మండలంలోని రావులపల్లి కలాన్ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత శుభోదయం కార్యక్రమంలో శంకర్‌పల్లి–వికారాబాద్ ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఇంతవరకు వేయలేదు.. రోడ్డు వేయించకుండా గ్రామంలోకి ఎలా వస్తాడని వాహనాన్ని నడిపే వ్యక్తిని హెచ్చరించారు. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో ఎంతో మంది ప్రమాదాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయని ఎమ్మెల్యే యాదయ్య తమ గ్రామంలోకి రాకూడదని నిలదీశారు. ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించుకున్న స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతుబంధు ఆపాలనడం సిగ్గుచేటు

మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, వైస్ ఎంపీపీ శివప్రసాద్

చేవెళ్ల: రైతుబంధును నిలిపివేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, పి.ప్రభాకర్‌లు ఆరోపించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైతుబంధు పథకంతో ఇప్పటి వరకు 11 సార్లు రైతులు లబ్ధిపొందారని అన్నారు. ఎన్నికల కోసం తీసుకొచ్చిన పథకం కాదని గుర్తించాలన్నారు. కావాలనే కాంగ్రెస్‌పార్టీ రైతు బంధు పథకంపై ఈసీకి ఫిర్యాదు చేసి రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. రైతుబంధును నిలిపివేసేందుకు ఫిర్యాదు చేయటం సరైనది కాదన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు మల్లారెడ్డి, నరహరి రెడ్డి, నాయకులు నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

# ఐక్యతగా గెలుపు సాధిస్తాం

కాంగ్రెస్ షాద్‌నగర్ అభ్యర్థి శంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో శంకర్

కొత్తూరు: పార్టీలో చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నప్పటికీ అన్నింటిని పరిష్కరించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్యన ఎలాంటి విభేదాలు లేవన్నారు. ఐక్యంగా ఉండి అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అధికారులను అడ్డం పెట్టుకుని ఇతర పార్టీల నాయకులపై అక్రమ కేసులు బనాయించిన ఘనత బీఆర్‌ఎస్ నాయకులకే చెల్లించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా మారుతుందన్నారు. అనంతరం ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, రియాజ్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

### కాలె యాదయ్య గెలుపు కోసం కృషి

నవాబుపేట: ఎమ్మెల్యే కాలె యాదయ్య గెలుపు కోసం కృషి చేస్తానని వైస్ ఎంపీపీ బందయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వలన కొంతకాలంగా ఎమ్మెల్యేకు దూరంగా ఉన్నానని, ఇప్పటి నుంచి యాదయ్య, పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని మూడోసారి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రంగారెడ్డి, భరత్ రెడ్డి, ఆనంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొంరాస్‌పేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గురువారం మండలంలోని నాందార్‌పూర్, బాపల్లితండా, ఏర్పుమళ్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యుత్, దివ్యాంగులకు వీల్‌చైర్, గదులకు కిటికీలు, తలుపులు ఉండేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



# ప్రాణం పోయినా పార్టీ మారను



చేవెళ్ల: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్

- ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్

చేవెళ్ల: గతంలో చేవెళ్ల ఎమ్మెల్యేలుగా గెలిచినోళ్లు పార్టీలు మారారు. కానీ నేను ప్రాణం పోయినా పార్టీ మారనని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామేన భీంభరత్ అన్నారు. గురువారం చేవెళ్లలోని కేజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని.. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సోనియా గాంధీ చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చారని.. ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు సేవ చేస్తూ అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యే యాదయ్య అధికార పార్టీలో చేరారని.. మాజీ ఎమ్మెల్యే రత్నం ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదన్నారు. ఈ ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకుడు బల్వంత్‌రెడ్డి, సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంటయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ గుప్తా, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సమతారెడ్డి, పెంటారెడ్డి, శ్రీనివాస్, ఖదీర్‌పాషా, వాజిద్, మల్లారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పామేన భీంభరత్

### చేవెళ్ల గడ్డ కాంగ్రెస్ కంచు కోట

శంకర్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామేన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట.. చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు మారాయి.. కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. సీఎం కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి దళితులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చి, దళితుల భూములను లాక్కొని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉదయమోహన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వై.ప్రకాష్‌గుప్తా, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు యాదయ్య, మైసయ్య, మండల యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం, గంట్లవెల్లి, శేరిగూడ, మధురాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలను అందించామని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో సీఎం కేసీఆర్ చేశారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధికి ఓటువేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భీష్వకిష్టయ్య, నారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బక్కన్నయాదవ్, రంగయ్యగౌడ్, సూర్యప్రకాష్, అగ్గనూరివిశ్వం, రఘుగౌడ్, లక్ష్మణ్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

### అసంతృప్త నేతలతో చర్చలు

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి సీనియర్ నేతలతో గురువారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి చర్చించారు. సీనియర్ నేత, మాజీ ఉప సర్పంచ్ దంగు శ్రీనివాస్‌యాదవ్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. విభేదాలు పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపు కోసం పని చేయాలని కోరగా అందుకు శ్రీనివాస్ యాదవ్ అంగీకరించారు. తాను టికెట్ ఆశించానని, రాకపోవడంతో కొంత అసంతృప్తికి గురయ్యానని ఆయన అన్నారు. పార్టీ గెలుపు కోసం తనతో పాటుగా అనుచరులందరు శాయశక్తులా కృషి చేస్తామని దంగు శ్రీనివాస్‌యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాస్ యాదవ్‌కు మాజీ ఎమ్మెల్యే కండువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య, తిరుపతిరెడ్డి, జమ్రుద్‌ఖాన్, బాల్‌రాజ్, రవి తదితరులు ఉన్నారు.